తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

బుధవారం
11 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, యూనిఫారాలు సకాలంలో అందించాలి

- నవంబర్ 20 నాటికి పెండింగ్ ప్రక్రియలన్నీ పూర్తి చేయాలి..
- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..
- వారథి పుస్తకంపై ప్రతిరోజూ రెండు పీరియడ్లు బోధించాలి..
- నిర్లక్ష్యం వహించే హెచ్ఎంలు, వార్డెన్లపై చర్యలు తప్పవు..
- ఐటీడీఏ పీవో బి.రాహుల్..



భద్రాచలం నవంబర్ 10 (జనంసాక్షి)
గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అందాల్సిన ఉపకార వేతనాలు, నాలుగు జతల యూనిఫారాలు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని, పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏటీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో నిర్వహించిన సమావేశంలో పాఠశాలల వారీగా విద్యా, పరిపాలనా అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు సంబంధించిన ఏ ఒక్క అంశం కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాలల బిల్లులు, సౌందర్య సాధనాల ఖర్చులు, భోజన ఛార్జీలు, యూనిఫారాల సరఫరాకు సంబంధించిన పెండింగ్ అంశాలను నవంబర్ 14లోగా పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందాల్సిన సౌందర్య సాధనాల ఛార్జీలు వారి బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చూడాలని, ఖాతాలు లేని విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఈపాస్ యాప్ ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించాలని సూచించారు. ఈ ప్రక్రియను నవంబర్ 20 నాటికి వంద శాతం పూర్తి చేయాలన్నారు. పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల నమోదును ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాలుగు జతల యూనిఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, కుట్టు పనుల్లో జాప్యం జరగకుండా టైలర్లతో మాట్లాడి త్వరగా యూనిఫారాలు సిద్ధం చేయించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. యూనిఫారాలు అందించిన అనంతరం ఫొటోలను సంబంధిత ఏటీడీవోలకు పంపాలన్నారు. కొన్ని పాఠశాలల్లో అదనంగా సరఫరా అయిన తెల్లటి బూట్లు, టైలు, బెల్టులను ఏటీడీవోలకు అప్పగించి అవసరమైన పాఠశాలలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించిన తర్వాతే స్వీకరించాలని, నాసిరకంగా ఉంటే తిరిగి పంపించి ఉప సంచాలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. పీఎంహెచ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వివిధ కారణాలతో **వార్తా లోపలి పేజీలో**



వెలుగుమట్ల ఇందిరమ్మ ఇళ్ల పనులు
వేగవంతం చేయాలి

- ఈ నెలాఖరులోగా మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలి
- నిర్మాణ పురోగతిని పరిశీలించిన కలెక్టర్ దివాకర టి.ఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 10 (జనంసాక్షి)
ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు అన్ని రకాల మౌలిక వసతుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. వెలుగుమట్ల మోడల్ కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వెలుగుమట్ల మోడల్ కాలనీలో మొత్తం 300 ఇళ్లకు మంజూరు ఇవ్వడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక ప్రకారం ఇప్పటికే 22 ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ముగిసి ఫినిషింగ్ దశకు చేరగా, 119 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని వివరించారు. అలాగే 59 ఇళ్లు రూఫ్ లెవల్, 98 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని అన్నారు. లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ఇళ్ల నిర్మాణ స్టేజీని బట్టి ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వివిధ దశల్లో ఉన్న 205 ఇళ్లకు సంబంధించిన పేమెంట్లు పూర్తయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇళ్ల నిర్మాణ వేగాన్ని పెంచేందుకు ఇప్పటివరకు 133 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించామని తెలిపారు. కాలనీ వాసులకు అవసరమైన **వార్తా లోపలి పేజీలో**

రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మోటకొండూరు మండలంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అభివృద్ధి పనుల ప్రారంభం



మోటకొండూరు, నవంబరు 10 (జనంసాక్షి):
రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి, చాడ, కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో, ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. **మిగతా 2లో**



హాలియాలో జిల్లా కలెక్టర్ పర్యటన

వైద్య కేంద్రం, కస్తూరిబా బాలికల వసతి గృహం తనిఖీ..



హాలియా, నవంబర్ 10 జనంసాక్షి :
నల్గొండ జిల్లా కలెక్టర్ హాలియా మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి స్థానిక ఆరోగ్య కేంద్రంతో పాటు కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో అందుతున్న సేవలు, సౌకర్యాలు, నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి, భోజనం, విద్యా సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి కలెక్టర్‌తో కలిసి పర్యటనలో పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వసతి గృహాల్లో విద్యార్థినులకు నాణ్యమైన వసతి, భోజనం, విద్యా సౌకర్యాలు కల్పించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, రవీందర్ రెడ్డి వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సహనియామక సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి : పోటు రంగారావు పిలుపు



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 10 (జనంసాక్షి)

అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వర్ధంతి సభల్లో భాగంగా ఖమ్మం ఒకటో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కై కొండాయగూడెంలో1వపట్టణ కార్యదర్శి జాలాది లెనిన్ అధ్యక్షతన నిర్వహించిన అమరవీరుల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. పోటు రంగారావు హాజరై మాట్లాడుతూ, దేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహిం చాలని పిలుపు నిచ్చారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ, పాలకవర్గాల విధానాల వల్ల పేద ప్రజలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారని విమర్శిం చారు. ఈ పరిస్థితుల నుంచి ప్రజలు బయట పడాలంటే, ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములై వ్యవస్థలో మార్పు కోసం కృషి చేయాలని అయన అన్నారు .దేశంలోని సహ జ వనరులను, ఖనిజాలు, బ్యాంకులు, ఇస్రో, ఇన్సూరెన్సు , బొగ్గు గనులు, పోస్టల్ ,రైల్వే,రోడ్లు, ప్రాజెక్టు,విమానయానం, భూ ములు, పెట్రోలు బావులు, అడవులు బడా కంపెనీలకు స్వదేశీ, విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతూ ప్రజా సంపదను దోపిడీ చేస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగు లకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశాడని, కాంగ్రెస్ అవినీతి పుట్టని విమర్శిస్తూ, మోడీ ప్రభుత్వంలో అవినీతి తిమింగ లాలు పెరిగిపోయినారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు 420 వాగ్దానాలు చేసి మూడు సంవత్సరాలు అవుతున్న ప్రజలకు న్యాయం చేయలేదని కాలయాపన చేస్తు న్నాడని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ వాళ్లకు ఉపాధి పథకం గా మారిందని, కాంగ్రెస్ కండు వాళ్ళు కప్పుకున్న వారికే ఇందిరమ్మ ఇల్లులు ఇస్తాననడం శో చ నీ యమని అన్నారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపడం దారుణమన్నారు.విమర్శించారు. సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా వేలాదిమంది అమరవీరులు చేసిన ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధన కోసం కార్యకర్తలు నిరంతరం పోరాటాలు చే యాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి సి వైపుల్లయ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, జిల్లా నాయకులు జి.రామయ్య, ఆవుల అశోక్, కే శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, నగర కార్యదర్శి పి శోభ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి జిక్కుల భరత్, రాచ బంటి రవి,పట్టణ నాయకులు బొల్లి కొమరయ్య, చిలకల నరసింహారావు, వనిత బొమ్మ కంటి రమేష్, లక్ష్మి,రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

అదేవిధంగా కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులతో పాటు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మెరుగైన పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు, నాణ్యమైన రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యేల్లంల సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి,ఆత్మకూరు పిఎసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి సర్పంచ్ లు, భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, జెన్న సిద్ధులు, ఏర్పుల రజిత శ్రీరాములు,గట్టి కొప్పుల సరిత మచందర్, పసల ప్రదీప్ కుమార్, ఆకుల శ్రీనివాస్, బుడిగ బాలరాజు,బొట్ల నగేష్,వాకిటి లింగారెడ్డి , సబ్ రిజిస్టర్ తాసిల్దార్ రాజేంద్రప్రసాద్ వివిధ గ్రామాల సర్పంచ్ లు పి ఎ సి ఎస్ డైరెక్టర్ భాస్కరుని రఘునాథరాజు, కంకల ఎలేందర్ బుగ్గ కొమురయ్య ,బోయిని ఝాన్సీ, ఆర్ ఐ వెంకట్ రామా రావు, ఉప సర్పంచ్ వంగాల నికిత మహేందర్ గౌడ్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు లు, సబ్ రిజిస్టర్ తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది వివిధ గ్రామాల రేషన్ కార్డు లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

ఆరోగ్య, విద్యా సదుపాయాలు కల్పించడంలో భాగంగా నిర్మిస్తున్న బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి అన్ని పనులనూ పూర్తి చేసి, కాలనీని మోడల్‌గా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి రాజీ పడకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.కలెక్టర్ తనిఖీ సమయంలో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఈ కె. జగ్రామ్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులు

1,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం!

ఇద్దరు అరెస్ట్.. రెండు వాహనాలు సీజ్.. మూడు నాటుసారా కేసులు నమోదు

అశ్వాపురం నవంబర్ 10 (జనంసాక్షి):

అశ్వాపురం మండలం భీమవరం గ్రామంలో నాటుసారా తయారీ, విక్రయాలపై మణుగూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మూడు నాటుసారా కేసులు నమోదు చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు.దాడుల్లో అక్రమంగా నాటుసారా తయారీకి వినియోగిస్తున్న 1,200 లీటర్ల బెల్లం పానకాన్ని అధికారులు ధ్వంసం చేశారు. 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న టీవీఎస్ ఎక్స్ఎల్, బజాజ్ ప్లాటినా వాహనాలను సీజ్ చేశారు.నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ అధికారులు హెచ్చరించారు.

అఖిలభారత కిసాన్ మహాసభలు జయప్రదం చేయండి



కల్లూరు నవంబర్ 10(జనం సాక్షి)

అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలు పోరాటాల పురిటి గడ్డ నల్గొండ లో ఈనెల 15, తేదీ నుండి18వ వరకు నాలుగు రోజులపాటు జరుగుతున్న సందర్భంగా మంగళవారం తాళ్లూరి వెంకటాపురంలో రైతు సంఘ జెండాను మోదుగు ఆశీర్వాదం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణార్జునురావు, రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య రైతు మహాసభల గురించి వివరించి మహాసభలను జయప్రదం చేయాలని 15వ తారీకు బహిరంగ సభలో పాల్గొ నాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు సోంబత్తిని కృష్ణ, రాజారాములు,రైతులు రేసు నాగేశ్వరరావు మర్సకట్ల డేవిడ్ మోదుగు కృష్ణ వసంతరావు గోపాలు పుల్లయ్య జె నాగేశ్వరరావు రైతులు వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

భక్తుల విరాళాలతో శ్రీ అభయాంజనేయ స్వామికి వెండి ఆభరణాలు

పెనుబల్లి, నవంబర్ 10 (జనం సాక్షి)

పెరుబల్లి మండలం వి ఎం బంజర్ శ్రీ అభయాంజనేయ స్వామి వారికి భక్తులు అందించిన విరాళాలతో వెండి మకరతోరణం, ఉత్సవ మూర్తులకు వెండి కిరీటాలను తయాచేయించారు. మంగళవారం ఆలయంలో భక్తులసమక్షంలో అర్చకులు శ్రీరంగం శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి అలంకరణ చేశారు. సుమారు 5 కిలోల వెండి తో 12 లక్షల రూపాయలుతో ఈ ఆభరణాలను ప్రత్యేకంగా చేయించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మిట్టపల్లి నరేంద్ర తెలిపారు. విరాళాలు అందించిన వారిలో వి.ఎం బంజర్ గ్రామానికి చెందినవనమా సత్య ప్రసాద్ లక్ష్మీ దంపతులురూ. 50,000లు, వంగ సుబ్బారావు లక్ష్మి శారదాంబ దంపతులు రూ.55,555లు, వేముల వెంకటేశ్వర్లు లక్ష్మీ దంపతులు రూ. 50,116లు. విజయవాడకు చెందిన గోగినేని సుబ్రహ్మణ్యం మౌనిక దంపతులు రూ.20,115లు. వి ఎం బంజర్ గ్రామానికి చెందిన భూక్య రాంబాబు చిన్ని దంపతులు రూ. 30,105లు, పులిచెర్ల నాగప్రసాద్ వెంకటరమణ దంపతులు రూ.5,116లు. వందనపు గోపాలరావు రాధాకుమారి దంపతులు రూ. 10,116 లు. కల్లూరు కు చెందిన. అప్పలనాయుడు సత్యవతి దంపతులురూ. 15,000 హైదరాబాద్ చెందిన ఈగ విశ్వద్రిక్ రెడ్డి జయచంద్ర రెడ్డి లహరి రూ.5,116 లు. వి.ఎం బంజర్ కు చెందిన మిట్టపల్లి నరేంద్ర వినీల దంపతులు రూ. 5,000లు. వంగా చిన్న పండుసునీత దంపతులు రూ.14,000లు. శ్రీరంగం శ్రీ దీక్ష, శ్రీవిద్య రూ. 10,116లు ఉన్నారు.

అరకొరగా ఆర్ అండ్ బి రోడ్డు పనులు.. ప్రజల ఇబ్బందులు పట్టవా?

అధికారుల నిర్లక్ష్యంపై మాలమహానాడు ఆగ్రహం : మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తాం: కాలవ సంసాన్..

అశ్వాపురం నవంబర్ 10 (జనంసాక్షి):

అశ్వాపురం మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆసుపత్రి నుంచి మెయిన్ సెంటర్ వరకు చేపట్టాల్సిన ఆర్ అండ్ బి ప్రధాన రహదారి నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంపై మాలమహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాలవ సంసాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద ఆసుపత్రి నుంచి మెయిన్ సెంటర్ వరకు రహదారి పనులను అరకొరగా వదిలేయడంతో గ్రామీణ ప్రజలు, వాహనదారులు, రోగులు, పాఠశాల విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము, ధూళి, గుంతలతో కూడిన రహదారిపై ప్రయాణించడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే ప్రధాన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయడంలో సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పనులను అసంపూర్తిగా వదిలేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిగిలిన రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమస్యను రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తామని



హెచ్చరించారు. రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగిస్తామని కాలవ సంసాన్ స్పష్టం చేశారు.

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, యూనిఫారాలు సకాలంలో అందించాలి

సుమారు 4,800 ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత వార్డెన్లు కళాశాలలను సందర్శించి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేసి నివేదికలు, ఫొటోలను సమర్పించాలని ఆదేశించారు.

పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థుల్లో వెనుకబడిన వారిని గుర్తించి తెలుగు, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో అదనపు తరగతులు నిర్వహించాలని రాహుల్ సూచించారు. ఉద్దీపకం వర్క్‌బుక్-3 అమలును పర్యవేక్షించడంతోపాటు, వారధి పుస్తకంలోని పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలను ప్రతిరోజూ రెండు పీరియడ్ల పాటు బోధించాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కూడా పర్యవేక్షించాలని, ఏటీడీవోలు విద్యాబోధన తీరుపై నిరంతరం సమీక్షించి నివేదికలు తీసుకోవాలని తెలిపారు. గోదావరి వరదల సమయంలో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించినప్పటికీ, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అవసరమైన సేవలు కొనసాగించాలని స్పష్టం చేశారు. అటువంటి రోజుల్లో విధుల నిర్వహణకు ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించాలని సూచించారు. ఇటీవల బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థుల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ నెల 20న మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపిన పీవో, అప్పటిలోగా అన్ని పెండింగ్ అంశాలను వంద శాతం పూర్తి చేసి సమగ్ర నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందన, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, భారతీదేవి, ఇన్‌చార్జి ఏవో రామకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.



సీపీఎం సీనియర్ నాయకుడు బుచ్చిరాములుకు కన్నీటి వీడ్కోలు..

పార్థివదేహానికి ఎర్రజెండా కప్పి విప్లవ నివాళులర్పించిన తమ్మినేని వీరభద్రం

ఖమ్మం రూరల్, నవంబర్ 10:(జనంసాక్షి)

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గొడ్డుగొర్ల బుచ్చిరాములు (అనారోగ్యంతో) సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, తమ్మినేని వెంకట్రావుతో కలిసి మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుని పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలతో విప్లవ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు బుచ్చిరాములుకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.బుచ్చిరాములు మృతి పట్ల కేవీపీఎస్ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్ననాటి మిత్రులు, బంధువులు ఆయన మృతితో కన్నీటిపర్యంతమయ్యారు. బుచ్చిం ాములుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్ల పై బైకు స్టంట్ చేస్తున్న యువకుడిపై కేసునమోదు

.అర్బన్ ఇన్స్ పెక్టర్. ఖమ్మం టౌన్ నవంబర్ (10) జనంసాక్షి.

ప్రమాదకరంగా బైక్ స్టంట్ చేస్తు ప్రజల భద్రత కు విఘాతం కల్పిస్తున్న బానోతు అనంత్ (23)పై కేసునమోదు చేసినట్లు ఇన్స్ పెక్టర్ నాగరాజు తెలిపారు బైక్ స్టంట్ చేస్తున్న వారిపై కరీనా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6బాలపేట ప్రాంతంలో టాస్క్ఫోర్స్ ఎ సి సి ఆధ్వర్యంలో ఎస్సై నరాల శ్రీనివాస్ ఖమ్మం అర్బన్ పోలీసులు సంయుక్త గా నిర్వహించిన దాడుల్ 250సిసిబి t s09fL6678నెంబర్ గల బైక్.తో స్టంట్ చేస్తున్న బాణోత్ అనంతు ను. అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు రోడ్ల పై స్టంట్లు చేస్తుతమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా హాని తలపెట్టే.వారిని. సహించబోమని ఇన్స్ పెక్టర్ హెచ్చరించారు. యువత ప్రమాదకరమైన విన్యాసాలు. కుదురంగా ఉండాలని ఉల్లంఘిస్తే. కటిక చర్యలు తప్పవని హెచ్చరించారు బైక్ స్టంట్ చేస్తు దొరికితే చట్ట వ్యతిరేక తీవ్రమైన కేసులు తప్పవని హెచ్చరించారు.



అఖిల భారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయాలి

- నవంబర్ 15న నల్లగొండ బహిరంగ సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

బూర్గంపహాడ్ నవంబర్ 10 (జనంసాక్షి)

నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత 36వ రైతు మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం బూర్గంపహాడ్ మండల కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం లక్ష్మీపురం సెంటర్‌లో రైతు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల నేపథ్యంలో 1936లో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆవిర్భవించిందని తెలిపారు. నేటికి ఆ సంఘం ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 36వ జాతీయ రైతు మహాసభలను వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పురిటిగడ్డ అయిన నల్లగొండలో నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో జరిగే ఈ మహాసభలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతు ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలను విజయవంతం చేసేందుకు బూర్గంపాడు మండలం నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, సీపీఎం శ్రేణులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రాయల వెంకటేశ్వర్లు, ఎస్‌కే అబీద్, గుంటక కృష్ణ, దుర్గారావు, నాగేశ్వరరావు, అశోక్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డిఇఓ శంభు ప్రసాద్

టేకులపల్లి, నవంబర్ 10(జనంసాక్షి):

టేకులపల్లి మండలంలోని కోయగూడెం, హనుమ తండా గ్రామాలలోని పాఠశాలలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల అభ్యాసన, పాఠశాలలో అమలు అవుతున్న అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి విద్యార్థులతో వివరంగా తెలుసుకున్నారు.వర్క్ బుక్ ను విద్యార్థులతో బాగా చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ సులానగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య , విద్యాశాఖ అధికారి సీసీ సునీల్, సి ఆర్ పి బాలాజీ,పాఠశాలలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య పాఠశాలలో ప్రకాశించిన చిన్నారి నక్షత్ర..

ఆటల పోటీలలో మొదటి బహుమతి ప్రతిభ!



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 10(జనం సాక్షి):

పాల్వంచ పట్టణం పరిధిలోని ఓద్దుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తాజాగా మంగళవారం నిర్వహించిన ఆటల పోటీలలో చిన్నారి, విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలలో ఎల్ కే జి (ఒఐఉ) తరగతి అభ్యసిస్తున్న చిరునవ్వుల విద్యార్థిని మొల్లగూరి నక్షత్ర అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది.?పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న నక్షత్ర, అద్భుతమైన ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకుంటూ మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయం ద్వారా ఆమె గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) మరియు ప్రతిభ సర్టిఫికెట్‌ను గెలుచుకుంది. ప్రిన్సిపాల్ మిరియాల రాణి మరియు క్లాస్ టీచర్ చందన బహుమతులను అందజేశారు.?చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తిని కనబరుస్తూ, పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నక్షత్రను పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మరియు తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల రాణి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, చిన్ననాటి నుంచే ఇలాంటి పోటీలలో పాల్గొనడం ద్వారా పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి సందీప్ (విలేఖరి), తల్లి ఎమ్ ఈశ్వరి(జెన్కో ఎంప్లాయ్)?తన కుమార్తె నక్షత్ర సాధించిన ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో నక్షత్ర మరిన్నిన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ ఆకాంక్షించారు.

జలసిరి కార్యక్రమంతో భూగర్భ జలాల సంరక్షణకు శ్రీకారం

- అంజనాపురంలో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులు ప్రారంభం

బూర్గంపహాడ్ నవంబర్ 10 (జనంసాక్షి)

గ్రామాల్లో భూగర్భ జలమట్టాన్ని పెంచడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్తులో నీటి కొరతను నివారించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా అంజనాపురం గ్రామపంచాయతీలో జల సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ బానోత్ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో వివిధ జల సంరక్షణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలమట్టం పెంపొందించేందుకు బోరుబావుల వద్ద రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యను అధిగమించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఊరికి ఊటకుంట.. ప్రతి పంట పొలానికి పంటకుంట.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత అనే నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి గ్రామాన్ని ఆదర్శ జల సంరక్షణ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పురుషోత్తం, ఈసీ వెంకటేష్, టీఏ వెంకటలక్ష్మి, వార్డు సభ్యుడు బికారి, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డిసెంబర్ 15న ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మం, (జనంసాక్షి) :

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మె నోటీసును ఖమ్మం నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి రమ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. ఆశా వర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, వేతనాలు కల్పించడం



లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపట్టడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఆశా వర్కర్లందరూ ఐక్యంగా సమ్మెలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి రమణ వైస్ ప్రెసిడెంట్ జె మంగ నాయకులు నిర్మల బుజ్జి విజయ రమ్య దుర్గ శిరీష వెంకటరమణ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈఓ ఆకస్మిక తనిఖీ

విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బూర్గంపహాడ్ నవంబర్ 10 (జనంసాక్షి)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థులు రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్. వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కళాశాల విద్యా, పరిపాలనా వ్యవహారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికలు, బోధనా డైరీలు, మార్కుల రిజిస్టర్లు, ప్రవేశ రికార్డులు తదితరాలను తనిఖీ చేసి వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జి. చీన్యా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. వైద్య ప్రయోగశాల సాంకేతిక నిపుణుల కోర్సు (ఎంఎల్‌టీ), కంప్యూటర్ టెక్నాలజీ (సీటీ) విద్యార్థులు ఉద్యోగ శిక్షణలో పొందుతున్న అనుభవాలు, ప్రాక్టికల్ నైపుణ్యాల గురించి ఆరా తీశారు. రాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల సన్నద్ధత, విద్యా





ప్రగతి, పరీక్ష ఫీజుల చెల్లింపు ప్రక్రియపై సమీక్షించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు క్రమం తప్పకుండా చదువుతూ, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమైన ఆయన సిలబస్ పూర్తి, విద్యార్థుల హాజరు, నాణ్యమైన బోధన, నిరంతర మూల్యాంకనంపై చర్చించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు తరగతుల ద్వారా వారికి మెరుగైన బోధన అందించాలని సూచించారు. కళాశాలలో క్రమశిక్షణతో పాటు రికార్డుల నిర్వహణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సీహెచ్. నాగేశ్వరరావు, ఎన్.ఎస్. కుమార్, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


నేటి నుంచి ఖమ్మంలో

రెండు రాష్ట్రాల స్థాయి 'బాలోత్సవ్'

బాలల నృత్య, సాంస్కృతిక పోటీలకు ముస్తాబైన భక్తరామదాసు కళాక్షేత్రం

తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్, వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

ఖమ్మం, (జనంసాక్షి):



చిన్నారుల్లోని కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఖమ్మం నగరంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి బాలల నృత్య, సాంస్కృతిక పోటీలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. బాలోత్సవ్ - ఖమ్మం బాలల పండుగ 2026 పేరిట స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రం వేదికగా నవంబర్ 11, 12 తేదీల్లో (బుధ, గురువారాలు) వేడుకలు జరగనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్ సమర్పణలో, వారధి ఫౌండేషన్ సహకారంతో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజైన బుధవారం (నవంబర్ 11న) వ్యక్తిగత నృత్య పోటీలు జరగనున్నాయి. ఇందులో శాస్త్రీయ (క్లాసికల్ సోలో), జానపద (ఫోక్ సోలో) విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఐదు నుంచి పదేళ్ల లోపు వయసున్న విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో, 11 ఏళ్ల పైబడిన వారికి సీనియర్స్ విభాగంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.రెండో రోజైన గురువారం (నవంబర్ 12న) శాస్త్రీయ, జానపద గ్రూప్ డ్యాన్స్ పోటీలతో పాటు ఫ్యాన్సీ డ్రెస్ (విచిత్ర వేషధారణ) పోటీలు జరగనున్నాయి. గ్రూప్ విభాగంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు జూనియర్స్ గాను, 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీనియర్స్ విభాగంగా విభజించారు. ఐదో తరగతి లోపు చదివే చిన్నారులకు ప్రత్యేకంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు శాస్త్రీయ, జానపద సంప్రదాయ పాటలను మాత్రమే ఎంచుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. సోలో నృత్యాలకు 5 నిమిషాలు, గ్రూప్ నృత్యాలకు 6 నిమిషాల గరిష్ట కాలపరిమితి ఉంటుందని, గ్రూప్ నృత్యంలో 5 నుండి 12 మంది వరకు సభ్యులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాల గుర్తింపు కార్డు (ఐడీ కార్డ్) వెంట తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడంతో పాటు, పాల్గొన్న విద్యార్థులందరికీ ధ్రువపత్రాలు ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే అత్యధిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యాసంస్థకు ప్రతిష్టాత్మక 'ఓవర్‌ఆల్ ఛాంపియన్‌షిప్' ట్రోఫీ బహూకరిస్తామన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో బాలలు, కళాకారులు పాల్గొననున్న ఈ వేడుకను విజయవంతం చేసి, చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించాలని తెలంగాణ డాన్సర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ అధ్యక్షులు కోరారు. పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ల కొరకు 9177630682, 8328277244 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

క్రీడా ప్రాంగణానికి కొత్త కళ.. పిచ్చి మొక్కల.. తొలగింపునకు శ్రీకారం

గ్రామ అభివృద్ధిలో పిండిప్రోలు మరో ముందడుగు..

జూనియర్ కళాశాల క్రీడా మైదానం అభివృద్ధిపై గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి

తిరుమలాయపాలెం నవంబర్ 10(జనంసాక్షి)

పిండిప్రోలు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్ కామల్ల సువార్త ఉప సర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ పాలకవర్గం ఆధ్వర్యంలో ముందడుగు వేస్తోంది. గ్రామంలోని జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, క్రీడలకు అనువుగా తీర్చిదిద్దేందుకు పిచ్చి మొక్కల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టింది. గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా ఉండకుండా శుభ్రపరిచి, విద్యార్థులు, యువత క్రీడా సాధనకు వినియోగించుకునేలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మైదానం పరిశుభ్రతతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం చర్యలు తీసుకుంటోంది.

క్రీడలకు ప్రోత్సాహం.. యువతకు భవిష్యత్తుకు బాట!

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సదుపాయాల అభివృద్ధి ఎంతో అవసరం. సరైన క్రీడా ప్రాంగణం అందుబాటులో ఉంటే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెరగడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ అలవడతాయి. ఈ దిశగా పిండిప్రోలు గ్రామపంచాయతీ పాలకవర్గం చేపట్టిన చర్యలు అభినందనీయం.మార్పు మాటల్లో కాదు.. చేతల్లో కనిపించాలి. గ్రామ అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియగా సాగాలి. ప్రజల అవసరాలను గుర్తించి చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు గ్రామ ప్రగతికి దోహదపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త ఉపసర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవి పిండిప్రోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రామకృష్ణ ఎన్ ఎస్ ఎస్ పి ఓ పి నారాయణరావు గ్రామపంచాయతీ పాలకవర్గం వార్డు సభ్యులు దొడ్డ గురవయ్య పప్పుల ఉపేందర్ పసలాది ముత్తయ్య గ్రామపంచాయతీ సిబ్బంది పరికిపల్లి చంద్రశేఖర్ పప్పుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు





కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- రైతులకు ఎకరాకు 30 వేల నుంచి 50 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలి
- శివన్నగూడెం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు అందించాలి
- మర్రిగూడ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో మహాధర్నా



మర్రిగూడ, నవంబర్ 10 (జనం సాక్షి)
రాష్ట్రంలో కరువు పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ మర్రిగూడ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ డిమాండ్ చేశారు. ఎల్‌నినో, ముసురు తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బుర్ర శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సరిపడా వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది పరిస్థితులు పూర్తిగా మారిపోయి ఎకరాకు కేవలం క్వింటాల్ మాత్రమే దిగుబడి వస్తోందని పేర్కొన్నారు. వరి రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా గుర్తించి రైతులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వరి రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున, పత్తి రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కౌలు రైతులు కూడా పంటల సాగులో తీవ్రంగా నష్టపోయారని, వారికి అందాల్సిన పరిహారాన్ని నేరుగా కౌలు రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని స్పష్టం చేశారు.మునుగోడు నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించేందుకు శివన్నగూడెం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీటి సౌకర్యం కలిగి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.అనంతరం రైతుల సమస్యలు, నష్టపరిహారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల చిక్షం రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండు, మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య, కామ్రేడ్ సత్యం, జక్కుల అంజయ్య, కొట్టాల సర్పంచ్ కలెట్ల లింగయ్య, సీనియర్ నాయకులు అయితే గోని వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొట్టం యాదయ్య, ఎర్రజాల మహేందర్, వేముల సత్తయ్య, జిల్లా బాలకిషన్, అబ్బనగొని కృష్ణయ్య, వెంకటయ్య, నల్లబోతు కొమురయ్య, బొల్లం యాదయ్య, గోల్కొండ రాధమ్మ, చిలువేరు రామచంద్రం, వేముల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి ఆకస్మిక తనిఖీ

వరి స్థానంలో ఆరుతడి పంటల సాగుకు రైతులకు సూచన

హాలియా జనం సాక్షి , నవంబర్ 10:
అనుముల మండలంలోని వివిధ విత్తన డీలర్ల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ బి. వినోద్ కుమార్ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాలను సందర్శించి, అక్కడికి వచ్చిన రైతులతో ముఖాముఖిగా మాట్లాడిప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే కాలంలో వర్షపాతం తగ్గే అవకాశం, నీటి లభ్యత, భూగర్భ జలమట్టం పరిస్థితులపై రైతులతో చర్చించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంట ఎంపికలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పెసర, మినుము, నువ్వులు తదితర ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ఎంచుకోవాలని అధికారి సూచించారు. అలాగే విత్తన డీలర్లు రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు తగినంత నిల్వలు సమకూర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హాలియా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి ఎం. సరిత గారు, మండల వ్యవసాయ అధికారి శ్రీ ఎం. వెంకన్న గారు, ఏఈఓ శ్రీ సత్యనారాయణ గారు, రైతు శ్రీ కొల్లు వెంకటరెడ్డి గారుతో పాటు ఇతర రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి



సంస్థాన్ నారాయణపురం. నవంబర్ 10 (జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తూ, ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల పదాధికారులు, ఆపై స్థాయి నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా మండల కమిటీలో బాధ్యతలు స్వీకరించిన పదాధికారులకు నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా దోనూరు వీరారెడ్డి మాట్లాడుతూ.. సంస్థాన్ నారాయణపురం మండలంలో భారతీయ జనతా పార్టీ చాపకింద నీరులా విస్తరిస్తోందని, మండల అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పిస్తూ, వారికి మనోధైర్యాన్ని అందించాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 13 ఏళ్లలో దేశంలో అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలను అమలు చేసిందని, వాటి ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వివరించాలని అన్నారు. 2014లో 36 శాతంగా ఉన్న పేదరికం ప్రస్తుతం రెండు శాతానికి చేరిందని పేర్కొంటూ, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన అగ్రగామి దేశంగా నిలబెట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీని ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమిలోని 29 పార్టీలు ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ఆ ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టేందుకు బీజేపీ కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ రెండు సర్పంచ్ స్థానాలను గెలుచుకోవడంతో పాటు వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ స్థానాల్లో కూడా విజయాలు సాధించడం శుభపరిణామమని అన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని ప్రక్షాళన చేసి, పార్టీ కోసం సమయం కేటాయించే చురుకైన కార్యకర్తలను బూత్ అధ్యక్షులుగా నియమించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దాసోజు వెంకటాచారి, గొల్లూరి యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శులు జక్కర్తి బిక్షం, చిలువేరు వెంకటేశం, కోడూరు బీరయ్య, ఉపాధ్యక్షులు బద్దం యాదయ్య గౌడ్, కట్కూరి లక్ష్మీ, వెంకటేష్ గౌడ్, కార్యదర్శులు గూడూరు ఇంద్రసేనారెడ్డి, జక్కర్తి నరసింహ, జర్పుల వినోద్, అంతటి సురేష్ గౌడ్, కార్యాలయ కార్యదర్శి కోగూరి శ్రవణ్ కుమార్, ఉపసర్పంచ్ మెరుగు సైదులు, బీజేవైఎం అధ్యక్షుడు ఉష్కావుల గిరిబాబు గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుకుడాల మహేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నెల్లికంటి శ్రీశైలం యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చెరుకుపల్లి రమణమ్మ, దళిత మోర్చా అధ్యక్షుడు అనిల్, చేనేత సెల్ కన్వీనర్ గూడేల్లి బాలరాజు, సోషల్ మీడియా కన్వీనర్ కరంటోత్ రమేష్ నాయక్, చెరుకుపల్లి సత్తయ్య, కందాల నర్సింహ,తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

కల్వూరు, నవంబర్ 10(జనం సాక్షి)
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపిస్తూ హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి నల్లగట్ల సీతారాములు తన ఉదారతను చాటుకున్నారు. కల్వూరు పట్టణానికి చెందిన మాతిపోగు పెద్దశేషయ్య (పెద్దబ్బాయి) మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు., బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పెద్దశేషయ్యతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని, గతంలో కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను నల్లగట్ల సీతారాములు గుర్తుచేసుకున్నారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని ఆయన చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు (నెంబర్ వెంకట్) మున్సిపల్ కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి, కె.వి., మోదుగు రమేష్, మాతిపోగు ఆనంద్, మాతిపోగు రాము, మాతిపోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు





అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి):
ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత పిలుపునిచ్చారు.మంగళవారం జిల్లా కేంద్రంలో మహాసభల ప్రచార కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు.అఖిల భారత కిసాన్ సభ 1936లో స్థాపించబడిందని,నాటి నుంచి దేశవ్యాప్తంగా రైతుల సమస్యలపై, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికుల సమస్యలు, గ్రామీణ ప్రజల జీవనోపాధి వంటి అంశాలపై ఈ జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాల వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగు ఖర్చుల పెరుగుదల, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం వంటి సమస్యలపై రైతాంగం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతుల సమస్యలు మహిళల జీవితాలతో కూడా ముడిపడి ఉన్నాయని, రైతు కుటుంబాల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐద్వా నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. రైతాంగ ఐక్యతను చాటుతూ ఈ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు వెంకట చంద్ర, జిల్లా ఆఫీస్ బేరర్స్ అండం నారాయణమ్మ, షేక్ ఖాజాబీ, జిల్లా కమిటీ సభ్యులు సుందరి రమాదేవి, గోలి భాగ్యమ్మ, కొప్పుల రజిత తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

నేరేడుచర్ల,నవంబర్ 10(జనంసాక్షి):

వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఏకశ్రీ జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ పి. నీరజ తెలిపారు.మండల రెవెన్యూ అధికారి, నేరేడుచర్ల ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 09న "స్వచ్ఛమైన, పవిత్రమైన ఓటర్ల జాబితా" అనే అంశంపై వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు నిర్వహించగా,అ పోటీలో కళాశాల స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన ఎస్.కె. సమీనా, ఎస్.కె. సమీరా, గోపి మరియు కె. ఏకశ్రీ డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి వ్యాసరచన మరియు క్విజ్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల,నేరేడుచర్ల తరఫున ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె. ఏకశ్రీ వ్యాసరచన పోటీలో ఆరో స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. నీరజ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వనపర్తి శ్రీనివాసులు,అధ్యాపకులు, సిబ్బంది వెంకటరమణ, డా. సైదులు, అపర్ణ,ప్రణతి, కె.ఎల్.ఎన్. నరసింహారావు, అన్వేష్ తదితరులు ఏకశ్రీని అభినందించి,జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అర్వపల్లి జెడ్ పీ హెచ్ ఎస్ లో "చదువుకో తెలంగాణ" పోస్టర్ ఆవిష్కరణ

జాజిరెడ్డిగూడెం(జనం సాక్షి):

విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా శ్రీరామ్ గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన "చదువుకో తెలంగాణ" కార్యక్రమాన్ని మంగళవారం అర్వపల్లి మండల కేంద్రంలోని జెడ్ పీ హెచ్ ఎస్ లో పోస్టర్‌ను శ్రీరామ్ గ్రూప్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఆవిష్కరించారు.?ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వరంగల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎమ్) గంగుల సతీష్ కుమార్, ఖమ్మం డివిజన్ మేనేజర్ రాజబోయిన భరత్ కుమార్, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ బందెల భరత్ కుమార్, పాఠశాల హెచ్ఎం పి. మల్లేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.?ఈ సందర్భంగా అర్వపల్లి పాఠశాలలో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులు మొహమ్మద్ అస్లాం, భాష, సిద్ధిక్, పొట్టెపాక శ్రావ్యలకు ప్రోత్సాహకంగా రూ.10,000 విలువైన చెక్కులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... "విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే శ్రీరామ్ గ్రూప్ ముఖ్య ఉద్దేశం" అని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు చేయూతనందిస్తూ శ్రీరామ్ గ్రూప్ నిర్వహిస్తున్న ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ సూర్యాపేట డెవలప్‌మెంట్ ఆఫీసర్లు కుంభం సురేందర్, రాజబోయిన రాజు, సేల్స్ మేనేజర్ యుగంధర్, సేల్స్ ఆఫీసర్ గోళ్ళ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ 15న నల్లగొండ రైతు సభను జయప్రదం చేయండి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి



మాడుగులపల్లి నవంబర్ 10 (జనంసాక్షి):

నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే 36వ జాతీయ రైతు మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు మాడుగులపల్లిలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీలో ఆయన మాట్లాడారు ఈ మహాసభలకు జాతీయ రైతు నాయకుడు రాకేష్ తికాయత్‌తో పాటు పలు రాష్ట్రాల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు మద్దతు ధరల చట్టం, లేబర్ కోడ్‌ల రద్దు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ తదితర రైతాంగ సమస్యలపై ఈ సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు, కూలీలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి, మల్లారెడ్డి, కుంచెం వెంకన్న, శ్రీకర్, నారాయణరెడ్డి, నాగయ్య, విష్ణు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అన్ని మండలాలు కరువు మండలాలు గా ప్రకటించాలి

రైతులకు తక్షణ పరిహారం అందించాలి.. బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ (జనంసాక్షి):

మిర్యాలగూడ నియోజకవర్గం లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సి పి ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు సోమవారం మిర్యాలగూడ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో బోర్లు, బావులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటతో పాటు మిర్చి, పత్తి పంటలు కూడా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.పంటల సాగు కోసం రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ, రెవెన్యూ అధికారులను గ్రామాలకు పంపించి మండలాల వారీగా పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని కోరారు.నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున, పత్తి, మిర్చి రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, పిడుగుల కారణంగా నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టానికి అనుగుణంగా పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐమండల కార్యదర్శులు ఎ. రామలింగం, జి. యాదగిరి, పి. ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో స్వాములకు 41 రోజులు అన్నప్రసాద వితరణ

రామాలయ చైర్మన్ మేడిపల్లి మోహన్ రావు , కోశాధికారి రేపాల వెంకన్న



హాలియా జనం సాక్షి నవంబర్ 10

హాలియాలో మాలధారణ దర్శించిన స్వాములకు స్థానిక రామాలయంలో 41ఒక రోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రామాలయం చైర్మన్ మేడిపల్లి మోహన్ రావు కోశాధికారి రేపాల వెంకన్న తెలిపారు. మంగళవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి లాంచనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేయడం చేయడం హ ర్షనీయమన్నారు . తన వంతుగా 25 క్వింటాళ్ల బియ్యాన్ని రామాలయం కోశాధికారి రేపాల వెంకన్న 25 క్వింటాళ్ల బియ్యాన్ని బుసిరెడ్డి పాండురంగారెడ్డి రెండు లక్షల 50 వేల రూపాయల కిరాణం సామాగ్రిని అందజేశారు ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఆర్య వైశ్య సంఘనీ ఉపాధ్యక్షుడు చీదళ్ళ లింగయ్యటై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మంద నరేందర్ రెడ్డి బాలకృష్ణ సకృనాయకు కౌన్సిలర్ సలహాదారు శ్రీను హ లియా పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మంచుకొండ ప్రభాకర్ దేవేందర్ నాంపల్లి రవి మంచుకొండ శ్రీనుసురేష్ సుధాకర్ రెడ్డిభక్తులు తదితరులు పాల్గొన్నారు.



బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపీడీవో

నూతనకల్ నవంబర్ 10 (జనంసాక్షి)

చలికాలంలో విద్యార్థులకు ఎలాంటి ఆసౌకర్యం కలుగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సునీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా వార్డెన్ చూసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో వార్డెన్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి శర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



నేరేడుచర్ల,నవంబర్ 10(జనంసాక్షి):

పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్చార్జి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు వినియోగదారుల చట్టం 1986 గురించి వివరించి, వినియోగదారుల రక్షణ చట్టం సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకొని రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలాలను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలి సిపిఐ డిమాండ్

కనగల్లు, నవంబర్ 10 (జనంసాక్షి)

రాష్ట్రంలో కరువు ఛయలు విలయతాండం చేస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల జాబితాను కేంద్రానికి అందజేయాలని నివేదిక అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వంవరికి ఎకరానికి30 వేలు, పత్తికి ఎకరానికి 50 వేలు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు జోగు సురేందర్, జీ నరసింహ, జె రాములు, జె సూరయ్య, యాదయ్య, టి సుదర్శన్, జోగు కృష్ణయ్య, జోగు నాగమ్మ, వెలుగు వెంకటేశం, చాడ నరసింహ, తలారి లచ్చయ్య వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.





ముత్తిరెడ్డిగూడెంలో ముదిరాజ్ సంఘానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేత

మోటకొండూరు, నవంబరు 10(జనంసాక్షి):

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఆ గ్రామ ముదిరాజ్ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామంలో సుమారు 50 ముదిరాజ్ కుటుంబాలు నివసిస్తున్నాయని, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. గతంలో గ్రామానికి వచ్చినప్పుడు కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ముదిరాజ్ సంఘం సమావేశాలు, వివాహాలు, శుభకార్యాలు మరియు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గడానికి కమ్యూనిటీ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంటూ, తక్షణమే హాల్ మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని వారు ఆ వినతిపత్రం ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జోరుక ఎల్లేష్ ముదిరాజ్.,మాజీ అధ్యక్షులు గుర్రాల రవి ముదిరాజ్,ముదిరాజ్ సంఘం నాయకులు గుర్రాల పరమేష్ ముదిరాజ్, గుర్రాల శ్రీను ముదిరాజ్,అన్నబోయిన నాగయ్య ముదిరాజ్, నీల రాజు ముదిరాజ్,గుర్రాల వెంకన్న ముదిరాజ్,రాపాక వెంకన్న ముదిరాజ్, గుర్రాల నాగరాజు ముదిరాజ్,గుర్రాల రేణుక తదితరులు పాల్గొన్నారు.



సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వైఎస్సార్

వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మోటకొండూరు/నవంబర్ 10(జనంసాక్షి):

మండలం లోని గిరిబోయినగూడెం గ్రామంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సత్సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి తన సొంత నిధులతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ నూతన వాటర్ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ముందుకు వచ్చి సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన యెల్లంల సంజీవరెడ్డిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవా దృక్పథంతో దాతలు ఇలా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. తమ గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ దాతకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహేతర సంబంధం చూసినందుకు బాలుడి హత్య

కల్లూరు నవంబరు 10(జనంసాక్షి)

మైనర్ బాలుడుతో వివాహహేతర సంబంధాన్ని పెట్టుకున్న మహిళ బాలుడుతో కలిసి ఉన్న సమయంలో మరో బాలుడు చూశాడని అందరితో చెప్తాడేమోనని బాలుడికి కూల్ డ్రింక్ లో పురుగుమందు కలిపి తాగించి హత్య చేసిన ఘటన మండలంలో జరిగింది. ఈ సంఘటన సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు పదో తరగతి చదువుతూ ప్రాణ స్నేహితులుగా ఉంటున్నారు. అందులో ఒకరు సత్తుపల్లి గురుకుల పాఠశాలలో చదువుతుండగా మరొకరు అదే గ్రామంలో 10వ తరగతి చదువుతున్నాడు. బోనకల్లు మండలానికి చెందిన మహిళ భర్తతో విడిపోయి ఉంటూ అమ్మమ్మగారిల్లు అయిన చిన కోరుకొండి వచ్చింది. చిన్న కోరుకొండిలో పదవ తరగతి చదువుతున్న బాలుడుతో పరిచయం ఏర్పరచుకొని ఆ బాలుడితో అక్రమ సంబంధం పెట్టుకుంది. సత్తుపల్లిలో చదువుతున్న మైనర్ బాలుడు దసరా సెలవులకి గ్రామానికి వచ్చిన సందర్భంగా తన స్నేహితుడు మహిళతో కలిసి ఉన్నది మైనర్ బాలుడు చూశాడు. దీంతో తమ విషయం కుటుంబ సభ్యులకి చెప్తాడని ఒక పథకం ప్రకారం అక్టోబర్ 24వ తేదీన ఊరు బయటకు తీసుకువెళ్లి కూల్ డ్రింకులో పురుగుమందు కలిపి నమ్మకంగా తాగించారు. దీంతో బాలుడు అనారోగ్యానికి గురి కావడంతో విషయం తల్లిదండ్రులు కు చెప్పటంతో తల్లిదండ్రులు అక్టోబర్ 25వ తేదీన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్య సేవలు అందిస్తుండగా పరిస్థితి విషమించి మైనర్ బాలుడు మృతి చెందాడు దీంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి మహిళని, మైనర్ బాలుడిని అరెస్టు చేసి విచారించగా పురుగు మందు తాగించినట్లు ఇరువురు అంగీకరించినట్లు సమాచారం .దీంతో రిమాండ్ కు తరలించారు.

చౌటుప్పల్‌లో అపరిశుభ్రతపై మున్సిపల్ అధికారుల ఉక్కుపాదం

అమెజాన్ కొరియర్ సర్వీస్‌కు రూ. 2000 జరిమానా

చౌటుప్పల్, నవంబర్ 10(జనం సాక్షి)



చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో పరిసరాలను అపరిశుభ్రం చేసే వారిపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు.చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ల ఆదేశాల మేరకు మంగళవారం 14వ వార్డులో పారిశుధ్య సర్వే నిర్వహించారు.ఈ సర్వేలో భాగంగా ఉడుగు జ్యోతి రమేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్,పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ లు వార్డు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 14వ వార్డు పరిధిలోని కాటమయ్య కాలనీ రోడ్డు వెంబడి ఉన్న “కోమలి లాజిస్టిక్స్” కొరియర్ సర్వీస్ (అమెజాన్ కంపెనీ) కార్యాలయం చుట్టుపక్కల, అలాగే ఆఫీస్ వెనుక భాగంలో ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, అట్ట పెట్టెలు మొదలైన చెత్తను పడేస్తూ పరిసరాలను తీవ్రంగా అపరిశుభ్ర పరుస్తున్నట్లు అధికారులు గుర్తించారు.బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం చట్టరీత్యా నేరమని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలంటూ సదరు కొరియర్ సర్వీస్ నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను సదరు ఆఫీస్ వారికి రూ.2000 రూపాయలు పెనాల్టీ (జరిమానా) విధించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.



మాజీ ఎంపీపీ బడుగు దానయ్యకు ప్రముఖుల ఘన నివాళులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 10 (జనం సాక్షి):

మాజీ ఎంపీపీ బడుగు దానయ్య అకాల మరణం పట్ల భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు కొమురెల్లి నరసింహారెడ్డి, మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొంగర కృష్ణ, బీజేపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు కర్నాటి ధనుంజయ, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తిరుపతి అఖిల భారత పద్మ శాలి అన్నసత్రం మాజీ అధ్యక్షుడు మునగపాటి వెంకటరత్నం, జిల్ల లక్ష్మీ నారాయణ, శ్రీశైలం పద్మశాలి అన్నసత్రం మాజీ అధ్యక్షుడు చిలువేరు చంద్రయ్య, అఖిల భారత అన్నసత్రాల మార్గ దర్శకుడు చిలువేరు కాశీనాథ్, భద్రాచలం పద్మ శాలి అన్నసత్రం మాజీ అధ్యక్షుడు మిరియాల సోమయ్య, కొత్తపేట పండ్ల మార్కెట్ ఫౌండర్ చైర్మన్ చిలువేరు చంద్రయ్య, మర్చంట్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్, పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్ర్ర పసాద్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగూరు పాండు, టీడీపీ మండల అధ్యక్షుడు మిాసాల నరసింహ



తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బడుగు దానయ్య ప్రజాసేవలో తనదైన గుర్తింపు సంపాదించుకున్నారని, ఆయన మృతి పోచంపల్లి ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా రోడ్డు పక్కన పచ్చని చెట్ల నరికివేత!

- **పోరెడ్డిగూడెం-పాములపాడు రహదారిపై యథేచ్ఛగా దందా**
- **పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు**
- **కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్**

మాడుగులపల్లి, నవంబర్ 10 జనంసాక్షి:

మాడుగులపల్లి మండల పరిధిలోని పోరెడ్డి గూడెం గ్రామం నుంచి పాములపాడు వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను కొందరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా యథేచ్ఛగా నరికివేస్తున్నారు ఏళ్ల తరబడి పచ్చగా ఎదుగుతూ ప్రయాణికులకు, బాటసారులకు చల్లని నీడనిస్తున్న పెద్ద చెట్లను ప్రభుత్వ లేదా అటవీ శాఖ అనుమతులు లేకుండా తెగనరుకుతుండటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగుతోంది.రోడ్డు వెంబడి దర్జాగా చెట్ల నరికివేత జరుగుతున్నా సంబంధిత అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు, వాహన దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రజాప్రతినిధులు కూడా కళ్లముందే చెట్లను నరుకుతున్నా మౌనం వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే అక్రమార్కులు తెగబడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేస్తున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, నరికిన కలపను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



బుడమర్లపల్లి గ్రామపంచాయతీలో డి ఎల్ పి ఓ విచారణ

కనగల్లు, నవంబర్ 10 (జనంసాక్షి)

మండలంలోని బుడమర్లపల్లి గ్రామపంచాయతీ లో 2023-24 సంవత్సరము లో ఉపాధి హామీ నిధుల నుంచి చేపట్టిన సిసి రోడ్డు పనులపై మంగళవారం డిఎల్పిఓ వెంకటేశ్వర్లు నేతృతము లో విచారణ నిర్వహించడం జరిగింది. విచారణకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి 23-24 ఆర్థిక సంవత్సరం ప్రత్యేక అధికారుల పాలన సమయంలో ఉపాధి హామీ పథకం నుంచి మంజూరైన4 లక్షల రూపాయలతో బొడ్డుపల్లి బిక్షం ఇంటి నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలో సిసి రోడ్డు పనులను చేపట్టారు. అట్టి పనులకు సంబంధించిన వివరాలలో ఏ వ్యక్తి పని చేశారు, ఆ పనికి సంబంధించిన తీర్మానాల లాంటి లిఖిత పూరకమైన పత్రాలు ఏమీ లేవు, కానీ ఆ పనిని నేనే చేశానని ఇదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు కారింగ్ సతీష్ తనకు 4 లక్షలకు సంబంధించి డబ్బులు ఇవ్వాలని గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి పై ఒత్తిడి తెచ్చారు. గ్రామ పంచాయతీ మినిట్స్ లో ఎలాంటి ఆధారాలు లేకుండా బిల్లు ఇవ్వడం ఎలా సాధ్యపడుతుందని చెప్పుకుంటూ వస్తున్నారు. ఇలా కాదనుకొని సతీష్ ఇటీవల జిల్లా పంచాయతీ అధికారికి మరో ఫిర్యాదు చేశారు. అట్టి ఫిర్యాదు ఆధారంగా స్థానిక సర్పంచను, ఫిర్యాదు దారుని డిపిఓ తన కార్యాలయం పిలిపించుకొని 4 లక్షల పనులకు సంబంధించిన బిల్లు ఇవ్వాలని డిపిఓ సర్పంచ్ జానయ్యకు సూచించారు. సర్పంచ్ జానయ్య స్పందించి ఇతనికే నాలుగు లక్షలకు సంబంధించిన బిల్లు ఇవ్వాలని లిఖితపూర్వకంగా ప్రొసీడింగ్ ఇస్తే దాని ఆధారంగా ఇవ్వడానికి ఆలోచిస్తామని సమాధానం చెప్పా రు. ఇలా అయితే తానే స్వయంగా గ్రామపంచాయతీకి వచ్చి విచారణ చేపడతారని తెలపడం డిపిఓ ఆదేశాల మేరకు డిఎల్పిఓ మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి గ్రామపంచాయతీకి చేరుకొని మొదటగా వివరాలను సేకరించి అనంతరం సిసి రోడ్ నిర్మించిన చోటుకు వెళ్లి పక్కనే ఉన్న నివాస గృహాల యజమానులతో మాట్లాడి వారి చెప్పిన విషయాలను రికార్డ్ వ్రాసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను స్వాధీనపరచుకొని విచారణలో సేకరించిన వివరాలను తదుపరి చర్యలకై జిల్లా అధికారులకు పంపనున్నట్లు డి ఎల్ పి ఓ తెలిపారు. విచారణలో ఎంపీ ఓ పుట్ట సతీష్ కుమార్, పి ఆర్ ఏఈ రామకృష్ణ, ఏ పీ ఓ సుధాకర్ పంచాయతీ కార్యదర్శులు వీరబాబు, సత్యనారాయణ రెడ్డి, బొడ్డు కాసిం, ఉప సర్పంచ్ కందుల రమేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బిల్లు ఇవ్వాలని నాపై డిపిఓ ఒత్తిడి.. సర్పంచ్ జానయ్య గౌడ్

ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామపంచాయతీలో చేపట్టిన సిసి రోడ్డు పనికి సంబంధించిన నాలుగు లక్షల రూపాయల బిల్లు ఇవ్వాలని నాపై జిల్లా పంచాయతీ అధికారి ఒత్తిడి తెస్తున్నారని సర్పంచ్ జానయ్య గౌడ్ ఆరోపించారు. సీసీ రోడ్ పనులు చేసిన వ్యక్తి పేరు గ్రామపంచాయతీ తీర్మానంలో ఎక్కడ లేదని ప్రభుత్వ సొమ్మును ఎవరికి ఇవ్వమంటే వారికి ఎలా ఇస్తామని దీనిపై అధికారులు పునరాలోచన చేయాలని పేర్కొంటూ, ప్రత్యేక అధికారుల పాలన గ్రామపంచాయతీ నిధులు 24 లక్షల రూపాయలు ఏ పనులు చేయకుండానే డ్రా చేశారని దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జానయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి: లకుమాల మధుబాబు

నిడమనూరు జనంసాక్షి, నవంబర్ 10:



నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు సంబంధించి వచ్చిన తీవ్ర ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని మాల మహానాడు నల్లగొండ జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికుడు బాలికలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, వారిని అసభ్యకరంగా తాకుతున్నాడని విద్యార్థినులు ఆరోపించారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.మంగళవారం లకుమాల మధుబాబు నిడమనూరులోని గురుకుల పాఠశాలను సందర్శించి, బాధిత విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు గంభీరమైనవని, వాటిని తేలిగ్గా తీసుకోకూడదని అన్నారు. ఆరోపణలపై నిజానిజాలు వెలికితీసేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత బాలికల భద్రత ముఖ్యం

బాధిత విద్యార్థినుల నుంచి ఎలాంటి ఒత్తిడి, భయం లేకుండా స్వతంత్రంగా వాంగ్మూలాలు సేకరించాలని మధుబాబు అన్నారు. వారి గోప్యతను పరిరక్షిస్తూ, భద్రతకు భంగం కలిగించకుండా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.బాలికల పాఠశాలలో పురుష పారిశుద్ధ్య సిబ్బందిని ఎలా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నియమించిన పురుష సిబ్బందిని తక్షణమే తొలగించాలని, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

సౌకర్యాలు, భద్రతపై డిమాండ్

గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారని, కనీస భద్రతా చర్యలు కూడా సరిగా అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని తీవ్రంగా విమర్శించారు.బాధిత బాలికలకు న్యాయం జరగాలని, పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు, పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని లకుమాల మధుబాబు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, బాధ్యతగల విచారణ నిర్వహించాలని కోరారు.

నేడు హెల్తీపై హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

సూర్యాపేట(జనంసాక్షి):

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో గల హెల్తీపై హాస్పిటల్‌లో నేడు ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు మతకాల చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు.డాక్టర్ అపర్ణ, డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ శిబిరంలో న్యూరాలజీ విభాగంలో పక్షవాతం, మూర్ఛ, మైగ్రేన్, తలనొప్పి, నరాల నొప్పులు, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, మతిమరుపు తదితర సమస్యలకు వైద్యుల సలహాలు అందించనున్నారని తెలిపారు.జనరల్ మెడిసిన్ విభాగంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలకు పరీక్షలు, చికిత్సపై సూచనలు ఇవ్వనున్నారని అన్నారు.ఆర్థోపెడిక్ విభాగంలో మోకాళ్లు, నడుము, మెడ, వెన్ను నొప్పులు, కీళ్ల సమస్యలు, ఎముకల గాయాలు, ఫ్రాక్చర్లకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.అవసరమైన వారికి ఈసీజీ, ఎక్స్‌రే, ఇతర అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు పూర్తిగా ఉచితమని, రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు వివిధ హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారుఅర్హత, వైద్య అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత దయాలసిస్, కిడ్నీ సమస్యలు, ఎముకల శస్త్రచికిత్సలకు ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 70759 41757లో సంప్రదించవచ్చని తెలిపారు.



శ్రీజ కుటుంబ సభ్యులకు ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల

శ్రీజ తండ్రితో ఫోన్లో కేటీఆర్ కు మాట్లాడించి నకంచర్ల భయపడవద్దు అని భరోసా ఇచ్చిన కేటీఆర్

కనగల్లు, నవంబర్ 10 (జనంసాక్షి)

అమెరికాలో విద్యనభ్యసిస్తున్న షాబ్దుల్లాపురం గ్రామ వాసి కోయ యాదగిరి రెడ్డి-రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2న అదృశ్యమైన సంఘటన లో ఆమె తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై రోదిస్తున్నారు. వారిని ఓదార్చడానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శ్రీజ తండ్రి యాదగిరి రెడ్డి దగ్గరికి వెళ్లి సంఘటన వివరాలను తెలుసుకొని అక్కడి నుంచే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించి యాదగిరి రెడ్డితో మాట్లాడించగా శ్రీజకు సంబంధించిన సమాచారాన్ని అక్కడ మనకు తెలిసిన వారితో మాట్లాడి ఆమె ఆచూకీ తెలిసేలా చూస్తానని మీరు భయపడవద్దని భరోసా ఇచ్చారు. శ్రీజ కుటుంబ సభ్యులకు ఓదార్చిన వారి లో నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీం పషా, మండల పార్టీ అధ్యక్షుడు అయితగోని యాదయ్య గౌడ్, బోయపల్లి జానయ్య, కడారి కృష్ణయ్య, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, కంచనపల్లి రవీందర్రావు, దండంపెల్లి సత్తయ్య, పుల్లకరం జానకి రాము, ఎర్రోళ్ల రాజు, తదితరులున్నారు.

నీటి, విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమం

దేవరకొండ, నవంబర్ 10 (జనం సాక్షి):

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి, విద్యుత్ పొదుపుపై దేవరకొండ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 20వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టడంతో పాటు అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను నిలిపివేసి విద్యుత్ ఆదా చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ గౌడ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రమావత్ సకృ నాయక్, వార్డు అధికారులు ఝాన్సీ, పద్మ, మెప్మా ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



లక్కీ డ్రా లో టీవీఎస్ జూపిటర్ ను గెలుచుకున్న హరీష్

సూర్యాపేట (జనంసాక్షి):

జిల్లా కేంద్రంలోని ఎంజీ షాపింగ్ మాల్ లో దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఆదివారం బిగ్ బాస్ ఫేమ్ ఝాన్సీచే నిర్వహించిన లక్కీ డ్రా లో సూర్యాపేటకు చెందిన తుమ్మ హరీష్ టీవీఎస్ జూపిటర్ ను గెలుచుకున్నారు.మంగళవారం ఎంజీ షాపింగ్ మాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హరీష్ కు ప్రొప్రైటర్ సాగిరాజు మధుసూదన్ రాజు, వెంకట పద్మావతి బైక్ అందజేశారు.ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ లక్కీ డ్రా లో బైక్ గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం సాగిరాజు మధుసూదన్ రాజు మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ప్రతి వెయ్యి రూపాయల కొనుగోలుపై ఒక లక్కీ డ్రా కూపన్ అందించినట్లు తెలిపారు.లక్కీ డ్రా విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.లక్కీ డ్రా లో విజేతలు కాని వారికి ఈ కూపన్లపై సంక్రాంతి పండుగ వరకు అదనంగా ఐదు శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తనూజ్, మేనేజర్ వర్మ, ప్రవల్లిక, కస్టమర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మున్సిపల్ కార్మికులకు 15 నెలల పిఎఫ్

రూ. 30 లక్షలు వెంటనే జమ చేయాలి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి : నెమ్మాది వెంకటేశ్వర్లు

హుజూర్ నగర్ నవంబర్ 10 (జనంసాక్షి):

మున్సిపాలిటీలో 2023బి2024 సవంత్సరాలపిఎఫ్ రూ.30 లక్షలు రూపాయలు వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం హుజూర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశం సందర్భంగా మున్సిపల్ పాలక వర్గాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పడక ముందు 2023-2024 కు చెందిన మొత్తం మున్సిపల్ సిబ్బందికి సుమారు 57లక్షల రూపాయలు జమ చేసినట్లు గా రికార్డులల్లో చూపిస్తున్నారు. కానీ కార్మికుల ఖాతాలో మాత్రం డబ్బులు జమ కాలేదన్నారు. సంబంధిత అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం చూస్తే ఖచ్చితంగా పిఎఫ్ డబ్బులు దారి మళ్లీనట్లుగా అనుమానం కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటి వరకు హుజూర్ నగర్ మున్సిపాలిటీలో కార్మికులకు సబ్బులు, బట్టలు, చెప్పులు, చీపుర్లు , పారలు, బ్లౌజులు, మాస్కులు ఇవ్వక పోవడం అన్యాయం అన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 42 రూపాయలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, ఆరోగ్య భద్రత కార్డులు ఇవ్వాలని, పండగ పూట సెలవలు ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, ఒంటరి, వితంతు పింఛన్లు అందించాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు, కుమారి, చంద్రమ్మ, వీరబాబు, రమణ, దేవకరణ, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట (జనంసాక్షి):

ఎల్ నినో ప్రభావంతో వంటలు పండకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వేలాది ఎకరాలు బీడు భూములుగా మారి పోయాయని, సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని అన్నారు. సూర్యాపేట జిల్లాలో అకాల వర్షాలతో పంటలు దెబ్బ తిన్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోయారని కాబట్టి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కేంద్రం 90 శాతం నిధులు అందజేసి, 200 రోజుల పాటు పని కల్పించాలని, రోజు కూలి 650 ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లావుల రాములు, ఉస్తేల నారాయణరెడ్డి, ధూళిపాల ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, బద్దం కృషా రెడ్డి, మండవ వెంకటేశ్వర్లు,ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, బూరవెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, ఎస్.కె లతీఫ్, ఎస్ కె సాయిబెల్లి, అనంతుల మల్లీశ్వరి, కొప్పోజు సూర్య నారాయణ, జడ శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, ఎడెల్లి శ్రీకాంత్, గూగులోతు రాజారాం, ఎర్రసాని రవి, కడియాల అప్పయ్య, చింతిర్యాల రవి, పాల్వాయి పున్నయ్య, కత్తి శ్రీనివాస్ రెడ్డి, ఎండి గౌస్ పాషా, పెండ్ర కృష్ణ, వాడపల్లి వెంకన్న, అయితగాని కామేష్, లక్ష్మీ, రెవిడాల జయసుధ, పొదిల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

అంజన్న గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర

వైద్య శిబిరం విజయవంతం

200 మందికి నేత్ర పరీక్షలు..,35 మందికి శస్త్రచికిత్స..

కోదాడ, (జనం సాక్షి):

కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతో 30 వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో మొత్తం 200 మంది పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య పరీక్షల అనంతరం 35 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన వైద్యులు,వారికి చికిత్స చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో చేపట్టినఈ కార్యక్రమం పలువురికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.సామాజిక బాధ్యతతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన కౌన్సిలర్ కారింగుల అంజన్ గౌడ్ కృషిని పలువురు అభినందించారు.ఇటువంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్,పంది తిరపయ్య ఎన్సిహెచ్ రాము,రాపోలు శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్,వంగవీటి శేఖర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మిట్టకోలు కమలాకర్,చలిగంటి రంగా, తంగెళ్ళపల్లి లక్ష్మణ్, మల్లయ్య, స్టాలిన్,నర్సి, శివ, శేషు,నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సర్పంచులకు ప్రభుత్వం

తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు

కడారి శ్రీశైలం యాదవ్

నాంపల్లి,నవంబర్ 10 (జనంసాక్షి)



గ్రామపంచాయతీలకు, గ్రామ సభలకు సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారని నాంపల్లి మండలానికి చెందిన పలువురు సర్పంచ్ లు నేడు తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి ని కలిశారు.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయడానికి జీవో నెంబర్.33 ను 11 అక్టోబర్ 2024న జారీ చేసింది. అప్పట్లో సర్పంచ్ లు లేకపోవటంతో స్పెషల్ ఆఫీసర్ లను కమిటీ చైర్మన్ గా నియమించింది కొత్తగా సర్పంచ్ లు ఎన్నికైన ప్రతిపక్ష బిఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ లకు సమాచారం ఇవ్వటం లేదని, జి వో నెంబర్ 33 ను రద్దు చేసి కొత్త జిఓ ఇచ్చేలా చూడాలని సర్పంచ్ లు కోరారు. న్యాయ నిపుణులతో సంప్రదించి ముందుకు వెళదామని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వారికి సూచించారు. కేటీఆర్, జగదీష్ రెడ్డి ని కలిసిన వారిలో సర్పంచ్ లు కడారి శ్రీశైలం యాదవ్, నక్క చంద్రశేఖర్, నడింపల్లి శ్రీలక్ష్మి యాదయ్య గౌడ్, సాగర్ల యాదయ్య,శోభ సహదేవ్,పెరికేటి రమేష్,, కోరే దేవేంద్ర సైదులు, మంతిపెల్లి మణిమాల శ్రీశైలంయాదవ్,పల్లె వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.





అభిమానులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య జడ్పీ మాజీ వైస్

చైర్మన్ కల్నాటి లింగారెడ్డి జన్మదినం వేడుకలు

పెద్దపూర నవంబర్ 10 జనంసాక్షి

నల్గొండ జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి పుట్టినరోజు వేడుకలు పెద్దపూరలో పండుగ వాతావరణంలో జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దపూర మండల సర్పంచ్ ఐతబోయిన వెంకటయ్య గౌడ్ మాజీ మండల అధ్యక్షులు పబ్బు యాదగిరి గౌడ్ మాజీ మండల యూత్ అధ్యక్షులు కిలారి మురళీకృష్ణ యాదవ్ పెద్దపూర వార్డ్ మెంబర్ల అధ్యక్షులు బొడ్డు వెంకట్ మరియు నాయకులు సతీష్ గౌడ్ మహమ్మద్ రంజాన్ హైమద్ అలీ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. మరియు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని లింగారెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



వరి కోతలు పూర్తవుతున్న ధాన్యం కొనుగోలు

కేంద్రాల ఏర్పాటు చేయరా

మాజీ ఎంపీపీ సీతయ్య

తుంగతుర్తి నవంబర్ 10 (జనంసాక్షి)

వరి కోతలు పూర్తవుతున్న ప్రభుత్వం నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు, మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ దాన్యాన్ని పోసి దాదాపు 15రోజులుగా పడిగాపులు కాస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాలు ప్రారంభించలేదని విమర్శించారు . మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం ఆవలంబిస్తున్న రైతు వ్యతిరేఖ విధానాల వలన మోసపోయిన రైతులు, ప్రభుత్వం ధాన్యం కొంటదా, కోనదా, అని అనుమాన పడుతున్నారని అన్నారు . ప్రభుత్వం, అధికారులు వెంటనే కేంద్రాలను ప్రారంభించి, కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు, .ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, మండల నాయకులు తునికి సాయిలు గౌడ్. మట్టిపెల్లి వెంకట్ పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్' జాతీయ

పురస్కారానికి చింత బాబు మాదిగ ఎంపిక

కోదాడ (జనంసాక్షి):



బహుజన హక్కుల పోరాట యోధుడు, ఎమ్మార్పీఎస్ కీలక నేత చింతాబాబు మాదిగను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణఈ పురస్కారాన్ని ప్రకటించగా, ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు చింతాబాబు మంగళవారం వెల్లడించారు.గత మూడు దశాబ్దాలుగా సామాజిక రంగంలో చింతాబాబు సేవలు అందిస్తున్నారు. 1990లలో మార్గదర్శి యూత్, స్ఫూర్తి యూత్ సంస్థల ద్వారా యువతను చైతన్యపరుస్తూ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గతంలో ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులు, 'దళిత రత్న' పురస్కారం పొందడంతో పాటు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా 'మాదిగ బంధు' బిరుదును అందుకున్నారు. జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు ప్రకటనపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి

○కొండమల్లేపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి
○సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



కొండమల్లేపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి): ఎలీనో ప్రభావంతో నెలకొన్న తీవ్ర కరువు ప్రభావంతో వర్షాభావం నీటి ఎద్దడి కారణంగా రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని తక్షణమే కొండ మల్లేపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటన చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావం, నీటి కొరత కారణంగా సాగు ప్రశ్నార్థకంగా మారిందని, వేసంగి రబీ పంటలు సాగు చేసుకునే పరిస్థితి కూడా లేదని అన్నారు. ఇప్పటికే పంటలు నష్టపోయిన రైతులు అప్పుల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి కరువు నిధులను తక్షణమే రైతులకు అందించాలని కోరారు. అఖిలపక్ష రైతు సంఘాల సమావేశం నిర్వహించి కరువు నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని వ్యవసాయానికి కరెంటు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనీ తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రబీ, వేసంగి పంటలు సాగు చేయలేని రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.కౌలురైతులను గుర్తించి వారికి కూడా పంట నష్టపరిహారం అందించాలి. కరువు పరిస్థితుల్లో చౌకధరల దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఉపాధి కోల్పోతున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక ఉపాధి పథకం అమలు చేయాలన్నారు. పంటల వారీగా నష్టపరిహారం చెల్లించాలని వరి పంటకు ఎకరానికి 30 వేలు,పత్తి పంటకు ఎకరానికి 50వేలు మిర్చి పంటకు ఎకరానికి 50వేలు ఇతర పంటలకు ఎకరానికి 20 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైతు రుణాలు రీషెడ్యూలు చేసి వడ్డీ మాఫీ చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి మరింత ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతాంగాన్ని ఆదుకునే వరకు సీపీఐ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర రెడ్డి, మండల నాయకులు పన్నాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సొమ్ల, దొడ్డి మధు, కళ్ళు చరణ్ రెడ్డి, ధర్మయ్య, వీరస్వామి, ఇద్దయ్య, కాశయ్య, లచ్చు, సొమ్ల, మంగత, వాసు, రాము, దాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సూర్యాపేట (జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడోసారి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అనురాధ కిషన్ రావు
మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా... అనురాధ కిషన్ రావు



తుంగతుర్తి నవంబర్ 10 (జనంసాక్షి)
సూర్యాపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు ముచ్చటగా మూడోసారి నియమితులయ్యారు, ఈ మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు, జిల్లాలో మహిళా కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళలను రాజకీయ చైతన్యవంతులుగా చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తారని తెలిపారు, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, శాసనసభ్యులు మందుల సామేలుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్ మిల్ డ్రైవర్ల వేతనాలు, అలవెన్సులు పెంచాలి

రైస్ మిల్లర్స్‌ను కోరిన టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : శీతల రోషపతి



హుజూర్‌నగర్ నవంబర్10(జనంసాక్షి):
పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్ డ్రైవర్ల వేతనాలు, అలవెన్సులు పెంచాలని టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి రైస్ మిల్లర్స్‌ను కోరారు. సోమవారం సాయంత్రం హుజూర్‌నగర్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీనరసింహారావుకు రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ తరపున 15 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ రైస్ మిల్లర్స్ యజమానులతో చర్చించి డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి మాట్లాడుతూ... ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే వేతన ఒప్పందం గత నెల అక్టోబర్ 31వ తేదీతో ముగిసిందని తెలిపారు. తిరిగి నూతన ఒప్పందం చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీలోపు రైస్ మిల్లర్స్‌కు అనుకూలమైన తేదీని తెలియజేయాలని కోరారు. ఇరువర్గాల మధ్య జాయింట్ చర్చలు నిర్వహించి కార్మికుల 15 డిమాండ్లను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ టిఎన్‌టియూసి అధ్యక్షులు గుండెబోయిన వెంకన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి కంకణాల రామయ్య పాల్గొన్నారు.

దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



సూర్యాపేట (జనంసాక్షి):
చిన్న దంత సమస్యలను కూడా నిర్లక్ష్యం చేస్తే పెద్ద అనారోగ్యాలకు దారితీస్తాయని జిల్లా కేంద్రంలోని సమ దంత వైద్యశాల డాక్టర్ సమ అన్నారు.సమ దంత వైద్యశాల 11వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె దంత పరీక్షలు నిర్వహించి మాట్లాడారు.పళ్ళలో నొప్పి, చిగుళ్ళ నుండి రక్తం రావడం, నోటి దుర్వాసన వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.క్రమం తప్పకుండా ఏడాదికి కనీసం రెండు సార్లు డెంటల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు.తీపి పదార్థాలు తినడం తగ్గించాలని,పొగాకు, గుట్కా వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని,సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.తమ హాస్పిటల్ నందు రెండు రోజులపాటు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యరగాని నాగన్న గౌడ్ జన్మదిన వేడుకలు

ఐఎన్టియుసి నియోజకవర్గ అధ్యక్షులు : బెల్లంకొండ గురవయ్య గౌడ్



హుజూర్‌నగర్ నవంబర్ 10 (జనంసాక్షి):
పట్టణంలోని ఇందిరా భవన్ లో మంగళవారం ఐఎన్టియుసి ఆధ్వర్యంలో నాగన్న గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ దంపతులు కేక్ ను కట్ చేసి ఐఎన్టియుసి అనుబంధ యూనియన్ నాయకులతో సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉన్న ఐఎన్టియుసి అనుబంధ 5000 వేల అనుబంధ సభ్యులకు గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పలాలు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఐకెపి, అంగన్వాడి, ఆశా వర్కర్స్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, ఆటో క్యాబ్ వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్ , పార్ బాయిల్డ్ మిల్లు వర్కర్స్ , పెట్టి వెండర్స్ , హమాలీలు , సివిల్ సప్లై డీలర్స్ ,సిమెంట్ ఇండస్ట్రీ కాంట్రాక్ట్ వర్కర్స్, కెమికల్ ఇండస్ట్రీ వర్కర్స్ సమస్యల కోసం ఐఎన్టియుసి ముందుండి పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నన్ను ఆశీర్వదించడానికి వచ్చి నాకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసిన ప్రతి కార్మిక సోదర, సోదరీమణులకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ ఐఎన్ టియుసి అధ్యక్షులు చిట్యాల అమర్నాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు మేళ్ళచెరువు ముక్కంటి, పట్టణ అధ్యక్షులు మద్దం నాగేందర్, మెడికల్ యూనియన్ నాయకులు ఇందిరాల రామకృష్ణ , జిల్లా నాయకులు పాశం రామరాజు యాదవ్, చింతకాయల రాము, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి, మండల మహిళా అధ్యక్షురాలు గద్దం వెంకటమ్మ , పట్టణ అధ్యక్షురాలు శివ పార్వతి, రేషన్ డీలర్స్ సంఘం నాయకులు షేక్ అజ్మతుల్లా, రాగం లింగయ్య, రాజీవ్ గాంధీ మట్టపల్లి అద్దా యూనియన్ నాయకులు హబీబ్, కస్తాల రవిందర్, కందుల వెంకన్న, శీలం వెంకన్న, పాలకూరి లాలు గౌడ్, రేణుక, సీత, శీలం వీరయ్య , క్రాంతి, సునిత, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.